



ఆత్మకూరు శివారులో ఆరబెట్టిన మిర్చి

గ్యారెంటీల బడ్జెట్

- వాటి అమలు కోసం రూ.53,196 కోట్ల కేటాయింపు
- నియోజకవర్గానికి 3,500 ఇళ్ల నిర్మాణం కోసం నిధులు
- ఎస్సీ, బీసీ గురుకులాల పాఠశాలలకు సొంత భవనాలు
- జిల్లాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు



మక్తల్ నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ముందు నుంచి అనుకున్నట్లుగానే బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు పెద్దపీట వేసింది. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితి పెంపును అమలు చేసిన విషయం తెలిసిందే. మొదటి బడ్జెట్‌లో మొత్తం ఆరు గ్యారంటీల అమలు కోసం అత్యధికంగా రూ. 53,196 కోట్లు కేటాయించింది. ఇప్పటికే ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి అభయహస్తం కింద ప్రజల నుంచి ఆరు గ్యారంటీల అమలు కోసం దరఖాస్తులు స్వీకరించగా.. వాటిని ఏ పథకం కోసం ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారనే లెక్కలను తీస్తోంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమం కింద 9,75,702 దరఖాస్తులను స్వీకరించగా.. గృహజ్యోతి, మహిళలకు రూ.500లకే సిలిండర్ పథకాలను కొద్దిరోజుల్లోనే ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. వనపర్తి జిల్లాలో ఉచిత సిలిండర్ కోసం 1,52,992 మంది దరఖాస్తు చేసుకోగా.. గృహజ్యోతి పథకం కోసం 1,36,289 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరి దరఖాస్తులను పరిశీలించి అర్హుల లెక్క తీయనున్నారు. ఇప్పటికే ఉచిత విద్యుత్ కోసం రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్‌లను విద్యుత్ శాఖ సిబ్బంది సేకరిస్తున్నారు. వచ్చే నెల నుంచి ఈ పథకం అమలవుతుందని చెబుతున్నారు. ఉచిత విద్యుత్ కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా రూ.2,418 కోట్లను కేటాయించారు. ఇందులో కీలకమైన రుణ మాఫీ పథకాన్ని అమలు చేస్తామని చెప్పినప్పటికీ.. ఆ దిశగా బడ్జెట్‌లో కేటాయింపులు లేవనే విమర్శలు వస్తున్నాయి. ఒక్క రుణమాఫీకే రూ.19వేల పైచిలుకు కోట్లు అవసరం ఉండగా.. మొత్తంగా వ్యవసాయానికి రూ. 19,476 కోట్లు కేటాయించారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం బడ్జెట్ ఉద్దేశించినప్పటికీ.. ఏ గ్యారంటీకి ఎంత ఖర్చు చేస్తారనే విషయాలను పొందుపర్చలేదు.

జిల్లాల వారీగా వచ్చిన ప్రజాపాలన దరఖాస్తులు

జిల్లా	దరఖాస్తులు
మహబూబ్‌నగర్	2,64,022
నాగర్‌కర్నూలు	1,95,235
వనపర్తి	1,74,794
జోగుళాంబ గద్వాల	1,72,599
నారాయణపేట	1,69,052



రాజాపూర్‌లో కిటికీలు లేని కేజీబీవీ

గురుకులాలకు సొంత భవనాలు..

గత ప్రభుత్వం రాష్ట్రంలో గురుకులాలను ఏర్పాటు చేసింది. చాలా పాఠశాలలకు భవనాలు లేవు. రేకుల షెడ్లు, అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. తాగునీటి సౌకర్యం, కిటికీలు, ప్రహరీలు లేకపోవడం, స్థలం చాలకపోవడం వంటి సమస్యలను విద్యార్థులు ఎదుర్కొంటున్నారు. ఒక్కో అద్దె భవనంలో మూడు నుంచి నాలుగు పాఠశాలలు నిర్వహిస్తున్న పరిస్థితి ఉమ్మడి జిల్లాలో ఉంది. ఈ నేపథ్యంలో ఎస్సీ గురుకులాల కోసం బడ్జెట్‌లో రూ.1,000 కోట్లు కేటాయించగా.. జిల్లాలో మొత్తం 32 ఎస్సీ గురుకులాలు ఉన్నాయి. వీటిల్లో కొన్నింటికి సొంత భవనాలు లేవు. అలాగే ఎస్టీ గురుకులాల నిర్మాణం కోసం రూ.250 కోట్లు బడ్జెట్ కేటాయించగా.. ఉమ్మడి జిల్లాలో 10 పాఠశాలలు ఉన్నాయి. వీటిలోనూ చాలా పాఠశాలల్లో సౌకర్యాలు లేవు. కొన్నింటినీ ఇంకా అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలు ఉమ్మడి జిల్లాలో 15 ఉండగా.. అందులో చాలావాటికి సొంత భవనాలు లేవు. అలంపూర్ మండలం పుల్లూరు బీసీ గురుకులంలో అద్దె భవనంలో మూడు పాఠశాలలు, ఒక కళాశాల నడుస్తోంది. అక్కడ నీటి సౌకర్యం సరిగా లేదు. కేజీబీవీలకు భవనాలు ఉన్నప్పటికీ కొన్నిచోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ వద్ద ఉన్న కేజీబీవీ బయట నుంచి సర్వాంగ సుందరంగా ఉన్నా.. రెండో ఫ్లోర్ నుంచి కిటికీలు లేవు. దాంతో విద్యార్థులు చలికి, ఎండకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ బడ్జెట్‌లో గురుకులాలకు సొంత భవనాల కోసం నిధులు మంజూరు చేయడంతో వారి ఇబ్బందులు తొలగనున్నాయి. అలాగే జిల్లాల్లో అత్యాధునిక సౌకర్యాలతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు చేసేందుకు రూ.500 కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది. ఒకే చోట కేజీ టూ పీజీ విద్య కాన్సెప్ట్‌ను గత ప్రభుత్వం తీసుకున్నప్పటికీ.. అది అంతగా సక్సెస్ కాలేదని చెప్పొచ్చు.

ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు..

గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లకు శ్రీకారం చుట్టగా.. మొదట ప్రభుత్వమే స్థలం గుర్తించి, గ్రామాల్లో రూ. 5.04 లక్షలు, పట్టణాల్లో రూ.5.30 లక్షల ఖర్చుతో ఇళ్ల నిర్మాణానికి పూనుకుంది. ఉమ్మడి జిల్లాలో ఈ పథకం అంతంతగానే సాగింది. ఒక్క మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో కొంత వరకు నిర్మాణాలు సాగగా.. నాగర్‌కర్నూల్, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాలేదు. కొన్ని నియోజకవర్గాల్లో నిర్మాణాలే పెద్దగా ప్రారంభం కాలేదు. ఆ తర్వాత రూ.మూడు లక్షల ఆర్థిక సాయం ఇచ్చి, సొంత స్థలంలో ఇళ్ల నిర్మాణానికి సహకరిస్తామని చెప్పగా దరఖాస్తులు స్వీకరించిన తర్వాత ప్రభుత్వం మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం సొంత స్థలంలో రూ.ఐదు లక్షల సాయంతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని చెప్పింది. ఈ ఏడాది నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున ఉమ్మడి పాలమూరు జిల్లాలో 42,000 ఇళ్లు మంజూరయ్యే అవకాశం ఉంది. వీటికి రూ.ఐదు లక్షల చొప్పున రూ.2,100 కోట్ల నిధులు అవసరం ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులైన పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, జవహర్ భీమా, నెట్టెంపాడుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు పేర్కొన్నప్పటికీ.. వేటికెంత అనేది స్పష్టత లేదు. అధికారులు మాత్రం సుమారు రూ.2,400 కోట్లు ప్రతిపాదనలు పంపారు. అలాగే పాలమూరు యూనివర్సిటీకి రూ.151 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు పంపగా.. ఎంత కేటాయించారనేది తెలియలేదు.

వర్సిటీలకు నిధులు కేటాయించడంపై హర్షం



రాష్ట్ర ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో పంచాయతీ, గ్రామీణ, వ్యవసాయం, సంక్షేమం, విద్య, వైద్యం రంగాలకు పెద్ద పీట వేశారు. అయితే వీటి కేటాయింపులు ఆరు గ్యారెంటీలతో సంబంధం లేకుండా ఉంటేనే పెద్దపీటగా చెప్పొచ్చు. మూల ధన వ్యయం తగ్గడం వల్ల రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి పెట్టుబడులు తగ్గాయని చెప్పొచ్చు. రూ.500 కోట్లు విశ్వవిద్యాలయాలకు కేటాయించడం హర్షించతగ్గ విషయం. ఆదాయం పెంచే మార్గాలు సూచించ లేదు.

- డాక్టర్ బీవీ రాఘవేందర్, పీయూ అర్థికశాఖ సహాయ ఆచార్యులు

బీసీలకు మొండి చేయి



తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలను పూర్తిగా విస్మరించింది. బలహీన వర్గాల సంక్షేమంపై ఏమాత్రం పట్టింపులేనట్లుగా బడ్జెట్ రూపొందించారు. బీసీ సంక్షేమానికి ఏడాదికి రూ.20 వేల చొప్పున ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల బడ్జెట్ ప్రవేశపెడతానన్న ప్రభుత్వం ప్రస్తుతం రూ.8 వేల కోట్లు మాత్రమే కేటాయించడం దారుణం. రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం విచారకరం.

- కృష్ణుడు, బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు, మ.నగర్

రైతు సంక్షేమాన్ని విస్మరించింది



బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించింది. రుణ మాఫీ ప్రకటన లేదు. వ్యవసాయ రంగానికి రూ.19,746 కోట్లు కేటాయిస్తే ఇక రుణమాఫీ ఎలా చేస్తారు. రైతులను తీవ్ర నిరాశ పరిచింది. రైతు భరోసాను ప్రస్తావించ లేదు. వరి, సోయా పంటలకు మద్దతు ఊసేలేదు.

- గోపాల్ యాదవ్, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు, మ.నగర్

తగ్గిన మిర్చి ధరలు

- గతేడాది కంటే సగం తగ్గుదల
- పడిపోయిన దిగుబడి
- ఆందోళనలో రైతులు
- వనపర్తి జిల్లాలో 2,760 ఎకరాల్లో సాగు



ఆత్మకూరు మండలం మూలమల్లలో వేసిన మిర్చి పంట

ఆత్మకూరు, ఫిబ్రవరి 10: మిర్చి ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా ఆరుతడి పంటగా 2,670 ఎకరాల్లో మిర్చి వేశారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదు కావడం, వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడి తగ్గింది. ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా.. ఎనిమిది నుంచి 10 క్వింటాళ్ల మాత్రమే వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను తామర, నల్లి, బూడిద తెగుళ్లు ఆశించడంతో రెండు రోజులకు ఒకసారి పురుగు మందులు కొట్టామని, దాంతో పెట్టుబడి భారం పెరిగిందని చెబుతున్నారు.

పలు రకాలు సాగు

జిల్లాలో అత్యధికంగా బ్యాడిగ 2043, త్రిమూర్తి 444, సూపర్ 10 వంటి రకాలను సాగు చేశారు. గతేడాది వీటికి అధిక దిగుబడి వచ్చి, ఎక్కువ రేట్లు పలకడంతో రైతులు ఈ సారి కూడా అవే సాగు చేశారు. కానీ గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది దిగుబడి, ధర పూర్తిగా తగ్గిందని రైతులు అంటున్నారు. గతేడాది ఏ గ్రేడ్ రకాలకు బ్యాడిగా రకానికి క్వింటాలుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ధర ఉండగా, మిగతా రకాలకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు ధరలు ఉన్నాయి. ఈ ఏడాది ధరలు సగానికి సగం ధరలు పడిపోవడంతో కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట సాగుకు ఎకరాకు సుమారు రూ.లక్షా 50 వేల వరకు పెట్టుబడి అయ్యిందని చెబుతున్నారు. ప్రభుత్వం మిర్చి ధరలను పెంచాలని, ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడి కూడా రాదు



గత ఏడాది మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి వేశా. ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ధరలు అనుకూలించడంతో పెట్టుబడి ఖర్చులు పోను కొంత మిగిలింది. ఈ ఏడాది కూడా మూడెకరాల్లో మిర్చి సాగు చేశా. కానీ ఎకరాకు ఎనిమిది నుంచి 10 క్వింటాళ్ల కూడా దిగుబడి రాలేదు. ధరలు తగ్గడంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- బాలకిష్టన్న, మిర్చి రైతు, మూలమల్ల

సస్య రక్షణతో దిగుబడులు



ఆరుతడి పంటలు సాగు చేసే రైతులు మొదటగా దుక్కిని చదును చేయకముందే పశువుల ఎరువులు చల్లుకుని, కలియ దున్నుకోవాలి. దీని ద్వారా మొక్కలు ఆరోగ్యంగా పెరిగి, తెగుళ్లను తట్టుకునే శక్తి వస్తుంది. అలా కాకుండా నేరుగా రసాయనిక ఎరువులు వాడటంతో పంటను తెగుళ్లను ఆశించడమే కాకుండా దిగుబడి తగ్గే అవకాశం ఉంది. మిరప పంటకు ఎర్ర చలక భూములు అనుకూలించవు.

- వినయ్ కుమార్, వ్యవసాయ అధికారి

వేరుశనగ ధాన్యానికి నిప్పు

- రూ.రెండున్నర లక్షల నష్టం

లింగాల, ఫిబ్రవరి 10 : గుర్తు తెలియని వ్యక్తులు వేరు శనగ ధాన్యానికి నిప్పంటించగా రూ.రెండున్నర లక్షల ఆస్తి నష్టం జరిగిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండ లం కోమటికుంట గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గడ్డం కాశన్న అనే రైతు శుక్రవారం గ్రామ శివారు లోని తన వ్యవసాయ పొలంలో 30 క్వింటాళ్ల వేరుశనగ ధా న్యాన్ని కుప్పగా పోసి ఇంటికి వెళ్లాడు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ధాన్యంతో పాటు, పొట్టుకు నిప్పం టించారు. శనివారం తెల్లవారుజామున గమనించిన రైతు కా వాలనే కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఘటనకు పాల్ప డ్డారని విచారం వ్యక్తం చేశాడు. ప్రమాదంలో రెండున్నర ల క్షల రూపాయల ఆస్తి నష్టం జరిగినట్లు కాశన్న వాపోయాడు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

కాంగ్రెస్ అవమానించింది.. బీజేపీ గౌరవించింది

- ఆర్థిక సంస్కరణలతో దేశ దశ దిశ మార్చింది పీవీ
- విలేకరుల సమావేశంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ పీవీని అవమానిస్తే బీజేపీ భారతదేశ అత్యున్నత పురస్కారం భారతరత్నను ఇచ్చి గౌరవించిందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పీవీ ఆర్థిక సంస్కరణలు, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్, ప్రైవేటైజేషన్ విధానాలను మొదలుపెట్టడం ద్వారానే దేశం దశ దిశ మారిపోయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పీవీ మరణించినప్పుడు ఏఐసీసీ కార్యాలయంలో చివరిచూపులకు కూడా మృతదేహాన్ని రానివ్వలేదని, దేశ ప్రధానులకు ఢిల్లీలో ఏర్పాటు చేసే ఘాట్‌లను కూడా పీవీకి ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యలు తను చెప్పినట్లుగానే దేశం పని చేస్తుందన్నట్లుగా హాస్యాస్పదంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అయిపోయిన పార్టీ బీఆర్ఎస్ అని విమర్శించారు.

గట్టులో గుట్టుగా స్వాహా

- గట్టు ఎత్తిపోతల పథకం కింద రూ.4 కోట్ల పరిహారం కాజేసినట్లు ఆరోపణలు
- అసైన్డ్ భూముల్లో బినామీ రైతులను చేర్చి అక్రమాలు
- 2013 భూసేకరణ చట్టం ఆసరాగా బాగోతం
- ఆర్డీవో కార్యాలయంలోని అధికారుల ప్రధాన పాత్ర
- బదిలీ అయ్యే వరకు అక్రమాలు బయటకు రాకుండా జాగ్రత్త
- పట్టా రైతుల ఫిర్యాదుతో వెలుగులోకి..



కొనసాగుతున్న గట్టు రిజర్వాయర్ పనులు

గట్టు, ఫిబ్రవరి 10: గట్టు ఎత్తిపోతల(నల్ల సోమనాద్రి ఎత్తి పోతల పథకం) పథకంలో భూ పరిహారం చెల్లింపుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయి. 2013 భూసేకరణ చట్టాన్ని అడ్డుగా పెట్టుకొని, పట్టాలు లేని వారిని పొజిషన్‌లో చూపి పరిహారం స్వాహా చేశారు. ఇందులో భారీగా ముడుపులు చేతులు మారాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం అసలు పట్టాదారులకు తెలియడంతో అధికారులు వారికి కూడా న్యాయం చేస్తామంటూ బుజ్జగిస్తూ.. ఇక్కడి నుంచి బదిలీ అయ్యే వరకు అక్రమాలు బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. నేటికీ పరిహారం రాక అసలు పట్టాదారులు లబోదిబోమంటున్నారు. పట్టాలు లేని వారిని పొజిషన్‌లో ఉన్నట్లుగా పేర్లు మార్చి, ఎంజాయ్‌మెంటు రిపోర్టుతో అక్రమాలకు తెరలేపినట్లు పట్టాలు కలిగిన రైతులు ఆరోపిస్తున్నారు.

పథకం స్వరూపం ఇదీ..

కురువ పీడిత మండలాలైన గట్టు, కేటీదొడ్డిలలో సాగు భూములకు నీళ్లందించాలనే ఉద్దేశంతో గట్టు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి 1.32 టీఎంసీ నీటిని ఉపయోగించి దాదాపు 33 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.586.06 కోట్ల వ్యయంతో పనులన ప్రారంభించారు. ఇందుకోసం మల్లాపురం గజ్జలమ్మ గట్టు దగ్గర రిజర్వాయర్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ రిజర్వాయర్ ద్వారా గట్టు, కేటీదొడ్డి, ధరూర్ మండలాల్లోని పలు గ్రామాలకు గ్రావిటీ ద్వార సాగునీరు అందనున్నది.



గట్టు ఎత్తిపోతలలో ముంపునకు గురవుతున్న ప్రభుత్వ భూములు

సర్వే చేస్తున్నప్పుడే అక్రమాలకు ఆజ్యం

ప్రాజెక్టు, కాలువ నిర్మాణానికి 975 ఎకరాల భూమిని సేకరించారు. కుచినెర్ల, ఆలూరు, రాయపురం గ్రామానికి చెందిన రైతులు భూములు కోల్పోతున్నారు. 975 ఎకరాల్లో పట్టా భూములతో పాటు ప్రభుత్వ భూములు ఉన్నాయి. అందులో 925 ఎకరాలు అసైన్డ్ భూమి కాగా.. మిగతాది పట్టా భూమి ఉంది. సర్వే నెంబర్ 141, 147లో దాదాపు 922 ఎకరాల వరకు అసైన్డ్ భూమి ఉంది. ఇది పలు దఫాలుగా అసైన్‌మెంటు కమిటీ ద్వారా పట్టాలు ఇచ్చిన భూమి కాగా, మరికొంత భూ ఆక్రమణ ద్వారా రికార్డులలోకి ఎక్కిన రైతులు సాగు చేస్తూ వచ్చారు. ఇవి వర్షాధార భూములే కావడంతో చాలా మంది రైతులు పట్టాలు ఉన్నప్పటికీ సాగుకు దూరంగా ఉంటూ వచ్చారు. అది ఇప్పుడు అక్రమార్కులకు వరంగా మారింది. భూ సేకరణ సమయంలో సంబంధిత రెవెన్యూ అధికారులు, సర్వేయర్‌లు

చట్టంలోని లొసుగుల ఆసరాగా..

2013 భూసేకరణ చట్టాన్ని అధికారులు, సర్వేయర్లు, అక్రమార్కులు చుట్టంగా మార్చుకున్నారు. పథకం కింద సేకరించినది ఎక్కువ మొత్తం ప్రభుత్వ భూమి కావడంతో వారికి వరంగా మారింది. భూమిని అసైన్డ్ పొందిన వారు మూడేళ్ల అంతకు మించి సాగులో లేకుండా, మరొకరు సాగుచేస్తున్నట్లు ఉంటే సాగులో ఉన్న వారి హక్కులను కాపాడేలా చట్టం ఉంది. దాంతో ఆ చట్టాన్ని ఆసరా చేసుకున్నారు. దాదాపు 120 ఎకరాలకు పైగా పొజిషన్(ఖాస్తు)లో కొత్తవారిని చూపి, పరిహారం పొందినట్లు తేలింది. సేకరించిన భూమిలో ఇప్పటి వరకు 531 ఎకరాలకు రూ.42 కోట్లు చెల్లించారు. 227 ఎకరాలకు పరిహారం చెల్లించాల్సి ఉంది. మరో 214 ఎకరాలను పెండింగ్‌లో పెట్టారు. దాదాపు 80 ఎకరాల భూమి పట్టా ఒకరిపేరు మీద ఉండగా.. పొజిషన్‌లో మరొకరి పేరు ఉన్నవారికి దాదాపు రూ.6 కోట్లు పరిహారంగా చెల్లించారు. దీనిని 2013 భూ సేకరణ చట్టం సమర్థిస్తోంది. వాస్తవంగా పరిహారం పొందిన వారు పొజిషన్‌లో లేరని, 2013 భూ సేకరణ చట్టాన్ని ఆసరాగా మార్చుకొని బినామీ పేర్లతో అక్రమాలకు పాల్పడ్డారని రైతులు ఆరోపిస్తున్నారు. అయితే ఇక్కడ ఎవరైతే రైతులు తమకు పట్టాలు ఉండి పరిహారం అందలేదని ఆరోపిస్తున్నారో వారు భూమిని సాగు చేస్తలేరని తహసీల్దార్‌తో అధికారులు నివేదిక తెప్పించుకొని తప్పించుకున్నారు.

అర్హులకు పరిహారం ఇస్తాం

గట్టు ఎత్తిపోతలలో ముంపునకు గురై, పొజిషన్‌లో ఉన్న రైతుల భూములకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాము. ఇప్పటి వరకు ముంపు భూముల రైతులు 535 మందికి రూ.42 కోట్ల చెల్లింపులు జరిగాయి. మిగిలిన వారికి కూడా త్వరలో చెల్లిస్తాం.

- సుబ్రమణ్యం, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

తాజా ఫిర్యాదుతో కలకలం

అసైన్డ్ పట్టాలు ఉన్న రైతులు తమకు పరిహారం ఇవ్వాలని కార్యాలయాల చుట్టూ తిరిగారు. కలెక్టర్‌ను సైతం కలిశారు. అయినా ఫలితం లేకపోవడంతో పట్టాలున్న తమకు కాకుండా అనర్హులకు పరిహారం ఇచ్చారని, అక్రమాలు జరిగాయని దర్యాప్తు సంస్థ సీబీఐకి ఫిర్యాదు చేశారు. పరిహారం పక్కదారి పట్టిన విషయం వెలుగు చూసినా అప్పటి అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. ప్రభుత్వ పెద్దల ద్వారా ఈ అవినీతిని తొక్కిపెట్టినట్లు అభియోగాలు కూడా వచ్చాయి. తాజాగా ఈ బాగోతంపై రైతులు ఫిర్యాదు చేయడంతో అక్రమార్కులు ఉలికిపాటుకు గురవుతున్నట్లు తెలుస్తోంది. రైతుల ఫిర్యాదుపై దర్యాప్తు సంస్థ ఏ మేరకు స్పందిస్తుందో వేచి చూడాలి.



యాగశాల ప్రవేశ పూజలో పాల్గొన్న ఆలయ చైర్మన్ చిన్న కృష్ణయ్య, ఈవో పురేందర్‌కుమార్, అర్చకులు

జోగుళాంబ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- 14న గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ రాక

అలంపూర్ చౌరస్తా, ఫిబ్రవరి 10: జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని అలంపూర్ జోగుళాంబ అమ్మవారి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా మొదటి రోజు ఉదయం స్వామివారి ఆనతి స్వీకరణ, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్‌వరుణం, మహాకలశ స్థాపన వంటి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ధ్వజరోహణం కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 14న గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ రానున్నట్లు ఈవో పురేందర్ తెలిపారు.






తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు శనివారం కొనసాగాయి. సమావేశానికి ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు హాజరయ్యారు. వారిలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఉన్నారు.





మార్మోగిన హనుమాన్ నామస్మరణ

- ముగిసిన అభయాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు
- చివరి రోజు పోటెత్తిన భక్తులు
- క్యూలైన్‌లో గంటల పాటు నిరీక్షణ

ఊర్కొండ, ఫిబ్రవరి 10 : నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామివారి బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయానికి భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. జైశ్రీరాం, జైహనుమాన్ నామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. వారంరోజుల పాటు జరిగిన ఉత్సవాలకు తండోపతండాలుగా భక్తులు వచ్చి స్వామిని దర్శించుకొని మొక్కులను చెల్లించుకున్నారు. బ్రహ్మోత్సవాల చివరి రోజు స్వామి దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లో గంటల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. ఉదయం స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు, చక్రతీర్థ స్నానం, అభిషేకం, అష్టోత్తర నామాలు, మంత్రపుష్పం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహం ఆలయం నుంచి ఊర్కొండపేట కీశే. చిరివెళ్లి కృష్ణమూర్తిశర్మ అర్చకుల గృహానికి మంగళహారతులు, వాయిద్యాలతో చేరటంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో సత్యచంద్రారెడ్డి, పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్సై వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు ప్రసాద్, రామచంద్రారెడ్డిలు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో పాలక మండలి సభ్యులు మనోహర్‌రెడ్డి, నర్సిరెడ్డి, రమేష్‌నాయక్, గోపాల్, అశోక్, చంద్రయ్య, సంగప్పగౌడ్, అంజయ్యగౌడ్, మల్లేష్‌యాదవ్, లక్ష్మమ్మ, సువర్ణ ఆలయ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, వరలక్ష్మీ, శ్రీశైలం, రవికుమార్, అర్చకులు దత్తాత్రేయశర్మ, ప్రవీణ్‌శర్మ, శ్రీనివాస్‌శర్మ, మహేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.


పల్లకీలో ఊరేగింపుగా ఊర్కొండపేట అర్చకుల గృహానికి వస్తున్న స్వామివారు

నేటి ఐదో తరగతి ఉమ్మడి ప్రవేశ పరీక్షకు సర్వం సిద్ధం

మన్ననూర్, ఫిబ్రవరి 10 : మన్ననూరు పీటీజీ గురుకుల విద్యాలయం, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల పరీక్ష కేంద్రాల్లో ఐదో తరగతి ఉమ్మడి ప్రవేశ పరీక్షను ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, విద్యార్థులు తొమ్మిది గంటల వరకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని గురుకులాల ప్రిన్సిపాళ్లు పద్మావతి, రూపాదేవిలు తెలిపారు.

ఉమ్మడి పాలమూరులో
ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్ల నియామకం

- మహబూబ్‌నగర్ ఆర్డీవోగా రంగనాథ్‌రావు, నాగర్‌కర్నూల్ ఆర్డీవోగా సురేశ్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 10 : ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలు జిల్లాలకు అడిషనల్ కలెక్టర్, భూసేకరణ కలెక్టర్‌లను నియమించారు. ఈమేరకు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్‌నగర్‌కు ఆర్డీవోగా వై.రంగనాథరావు, నాగర్‌కర్నూల్ ఆర్డీవోగా ఆసిఫాబాద్ ఆర్డీవో కడం సురేశ్‌ను నియమించారు. గద్వాల రెవెన్యూ అడిషనల్ కలెక్టర్‌గా మునిసిన వెంకటేశ్వర్లు, వనపర్తి రెవెన్యూ అడిషనల్ కలెక్టర్‌గా మహ్మద్ అసదుద్దీన్, మహబూబ్‌నగర్ భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఏ.నిర్మల, గద్వాల భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా టి.శ్రీనివాసరావు, నాగర్‌కర్నూల్ భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఎస్ఆర్ సరిత, నాగర్‌కర్నూల్ ఎంజీకేఎల్ఐ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బి.అరుణరెడ్డిలను నియమించారు.

ప్రశాంతంగా ముగిసిన నవోదయ ప్రవేశ పరీక్ష

బిజినేపల్లి, ఫిబ్రవరి 10 : వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ, 11వ తరగతుల్లో ప్రవేశం పొందేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసిందని పరీక్షల నిర్వహణ అధికారి వడ్ల భాస్కరాచారి తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొమ్మిదవ తరగతి ప్రవేశ పరీక్షకు 1,704 మంది దరఖాస్తు చేసుకోగా 1,240 మంది విద్యార్థులు హాజరయ్యారని, 11వ తరగతి ప్రవేశ పరీక్షకు 2,041 మంది దరఖాస్తు చేసుకోగా 1,663 మంది హాజరయ్యారు. 3,745 మంది విద్యార్థులకు గాను 77 శాతం 2,903 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేసిన పోలీసు సిబ్బంది, వివిధ జిల్లాల విద్యాశాఖ అధికారులు, వైద్య శాఖ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

లింక్ పేరుతో డబ్బులు డ్రా

- సైబర్ క్రైం నమోదు

జడ్చర్ల, ఫిబ్రవరి 10 : మీకు క్రెడిట్ కార్డు మంజూరీ అయ్యింది.. కార్డును కొరియర్ బాయ్‌తో పంపిస్తున్నాను.. కార్డు తీసుకునేందుకు లింక్ పంపిస్తున్నాను.. ఐడీ నెంబరు చెప్పండంటూ నమ్మబలికించి, బ్యాంకు ఖాతాలో నుంచి రూ.ఒక లక్షకు పైగా డ్రా చేసిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో చోటుచేసుకుంది. జడ్చర్ల ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. జడ్చర్ల పట్టణంలోని వెంకటేశ్వరకాలనీలో కడప జిల్లా బద్వేల్ ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్లు నివాసం ఉంటున్నాడు. గతనెల 28న ఓ ఆగంతకుడు ఫోన్ చేసి క్రెడిట్ కార్డు పేరుతో లింక్‌ను పంపించి వేర్వేరు రెండు ఖాతాల నుంచి వరుసగా రూ.9699, రూ999, రూ1,06,998 డబ్బులను డ్రా చేశాడు. వెంటనే మోసపోయినట్లుగా గుర్తించిన బాధితుడు సైబర్‌క్రైం నెంబరు 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. అందుకు సంబంధించి శనివారం జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై వివరించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

- పాఠశాలలో విధులు నిర్వహిస్తుండగానే ఘటన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 10 : గుండెపోటుతో ఉపాధ్యాయుడు సందోళ్ల అంజిలయ్య(52) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలం నంచర్ల ప్రాథమికోన్నత పాఠశాలలో అంజిలయ్య సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కొంతకాలంగా డీఈవో మౌఖిక ఆదేశాల మేరకు అదే మండల పరిధిలోని షేక్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం షేక్‌పల్లి పీఎస్‌లో విధులు నిర్వహిస్తుండగా మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఛాతిలో నొప్పి వస్తుందని తోటి ఉపాధ్యాయులకు తెలిపాడు. వెంటనే వారు ఓ వాహనంలో మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. అంతలోనే మృతి చెందినట్లు ఉపాధ్యాయులు, ఎంఈవో వెంకటయ్య తెలిపారు. అంజిలయ్యది మహమ్మదాబాద్ మండలం గాదిర్యాల్ గ్రామం కాగా, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మదుగునగర్‌లో నివాసం ఉంటున్నాడు. మృతుడికి గతంలోనూ గుండెనొప్పి రాగా సర్జరీ జరిగినట్లు కుటుంబీకులు తెలిపారు. ఉపాధ్యాయుడి మృతి పట్ల డీఈవో రవీందర్, ఎంఈవో, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.


అంజిలయ్య (ఫైల్)

క్రిమి సంహారక మందు తాగి యువకుడి ఆత్మహత్య

రాజోలి, ఫిబ్రవరి 10 : క్రిమిసంహారక మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలోని రాజోలి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. రాజోలి ఎస్సై జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని బోయలగూడెంకు చెందిన తెలుగు వీరేష్(22)కు సంవత్సరం క్రితం రాజోలి గ్రామానికి చెందిన భారతితో వివాహం జరిగింది. ఇటీవల ఆమెకు కూతురు జన్మించడంతో తల్లి గారి ఇంటికి వచ్చింది. శుక్రవారం పొలానికి వెళ్లకుండా వీరేష్ ఇంట్లోనే ఉండడంతో కుటుంబీకులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన వీరేష్ ఇంట్లో ఉన్న పురుగుల మందు తీసుకుని రాజోలికి బయలుదేరాడు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో మార్గమధ్యలోనే పురుగుల మందు తాగి, రాజోలిలోని తన భార్య, కూతురిని చూసేందుకు అత్తమామల ఇంటికి వచ్చాడు. కొద్దిసేపటికే కుప్పకూలి కింద పడటంతో వారు శాంతినగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి తెలుగు రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గొర్రెల దొంగ పరార్

ఇటిక్యాల, ఫిబ్రవరి 10 : గొర్రెలు ఎత్తుకెళుతున్నట్లు అనుమానించిన గ్రామస్థులు నిందితుడిని పట్టుకునే లోపు గొర్రెలను వదిలిపెట్టి పరారైన సంఘటన శనివారం ఇటిక్యాల మండలంలోని షాబాద గ్రామంలో చోటు చేసుకొంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనంపై రెండు గొర్రెలను వేసుకొని అడ్డదారిలో వడ్డేపల్లి మండలం జక్కిరెడ్డిపల్లి గ్రామం వైపు నుంచి షాబాద గ్రామంలోకి రాగా గ్రామస్థులకు అనుమానం వచ్చి గొర్రెల విషయం ఆరా తీశారు. సరైన సమాధానం చెప్పకుండా గొర్రెలను అక్కడే వదిలి ద్విచక్ర వాహనంపై పారిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. ఇతడు గతంలో కూడా దొంగతనాలు చేస్తుండేవాడని అనుమానం వ్యక్తం చేశారు. కాగా, గొర్రెల దొంగతనం విషయంపై ఇటిక్యాల పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని వారు తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

- సోదరుల ఫిర్యాదుపై కేసు నమోదు

అలంపూర్ చౌరస్తా, ఫిబ్రవరి 10 : ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో చోటు చేసుకుంది. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన బండారి ప్రసాద్(38), సుగుణమ్మ దంపతులు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. గత రెండేళ్లుగా భార్యాభర్తలు తరచూ గొడవ పడుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రసాద్ ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లో ఉంటున్న సోదరుల్లో ఒకరైన చిట్టిబాబు శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యవసాయ బావిలో వ్యక్తి శవం

- కుళ్లిపోయిన స్థితిలో గుర్తు తెలియని మృతదేహం

హన్వాడ, ఫిబ్రవరి 10 : గుర్తు తెలియని వ్యక్తి(45) దాదాపు పదిరోజుల క్రితం వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం వేపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం గ్రామ శివారులోని సవార్లోబావి వద్ద అటుగా ఉన్న రైతులకు దుర్వాసన వచ్చింది. దీంతో వారు బావిలో చూడగా శవం కనిపించింది. ఈ విషయం గ్రామస్థులందరికి తెలియడంతో పోలీసులకు సమాచారాన్ని అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు శవాన్ని బయటకు తీశారు. మృతదేహన్ని గ్రామస్థులెవరూ గుర్తు పట్టకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి శవంగా పోలీసులు కేసు నమోదు చేశారు. శరీరంపై ఉన్న ఆనవాళ్లను గుర్తించగా, మోచేతిపై బుచ్చయ్య అని పచ్చబొట్టుతో రాసి ఉంది. ఈ ఘటన దాదాపు పదిరోజుల క్రితం జరిగినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహం కుళ్లిపోయింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఊర్కొండ, ఫిబ్రవరి 10 : ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాదారం గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాసులు(60) ఈనెల ఐదో తేదీన భార్యతో గొడవపడి ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. దాంతో కుటుంబ సభ్యులు గమనించి కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స అందిస్తుండగా శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి కుమారుడు చలపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

బైకు అదుపు తప్పి యువకుడికి గాయాలు

గండీడ్, ఫిబ్రవరి 10 : మోటర్‌సైకిల్ అదుపు తప్పి ఓ యువకుడికి గాయాలైన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం మొకర్లబాద్ గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గండీడ్ మండలం సల్కర్‌పేట్ గ్రామానికి చెందిన కృష్ణ అనే యువకుడు మహబూబ్‌నగర్ వైపు బైక్‌పై వెళ్తుండగా వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. ప్రమాదంలో తలకు, కాలుకు గాయాలయ్యాయి. 108కి సమాచారం అందించడంతో ఈఎంటీ లక్ష్మీనారాయణ, పైలెట్ అక్బర్ క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కల్వకుర్తి, ఫిబ్రవరి 10 : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు కల్వకుర్తి ఎస్సై జి.మాధవరెడ్డి తెలిపారు. కల్వకుర్తి పట్టణంలో శనివారం కే.శ్రీను ఇంటి ముందు పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.32వేల నగదు సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

కూలిన ఇంటి పైకప్పు

- కుటుంబీకులకు తప్పిన ప్రమాదం

రేవల్లి, ఫిబ్రవరి 10 : వనపర్తి జిల్లా రేవల్లి మండలం తలుపునూరు గ్రామంలో ఓ ఇంటి పైకప్పు కూలింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. గ్రామానికి చెందిన కొత్తకాపు వెంకటరెడ్డి అనే రైతు శుక్రవారం భార్యతో కలిసి పొలం పనులకు వెళ్లాడు. ఇంట్లో కూతురు, మనువడు ఉన్నారు. శుక్రవారం రాత్రి ఏడు గంటల సమయంలో ఆకస్మాత్తుగా ఇంటి పైకప్పు కూలింది. ఆ సమయంలో ఇంట్లో కూతురు, మనువడు పక్కగదిలో ఉన్నారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. కూలిన పైకప్పు గదిలో సామాను, మంచం, బీరువా, ఫ్యాన్లు తదితర సామగ్రి విరిగి పోయి రూ.50వేల ఆర్థిక నష్టం వచ్చినట్లు బాధిత రైతు వెంకటరెడ్డి శనివారం విలేకర్ల ముందు వాపోయాడు.

పామును మింగిన కప్ప

గట్టు, ఫిబ్రవరి 10 : సాధారణంగా పాము కప్పను మింగడం సహజం. కానీ ఇక్కడ మాత్రం కప్పనే పామును మింగిన ఆశ్చర్యకరమైన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం లింగాపురం గ్రామ సమీపంలోని భీమరాయుడి ఆలయ ఆవరణలో శనివారం చోటు చేసుకుంది. ఆలయ ఆవరణలో చిన్నపాటి గుంతలో నుంచి పామును మింగుతూ ఓ కప్ప బయటకు వచ్చింది. పాము తలను మాత్రమే బయటకు ఉంచి తోక నుంచి మింగేసింది. గమనించిన కొందరు గ్రామస్థులు అరుదైన ఈ దృశ్యాన్ని తమతమ మొబైళ్లలో వీడియో తీశారు. కొద్దిసేపటికి కప్ప పామును బయటకు కక్కివేయగా పాము బతికిందని తెలిపారు. ఆశ్చర్యకరమైన ఘటనను చూసిన గ్రామస్థులు కలికాలం అంటే ఇదేనేమో అంటూ పలు విధాలుగా చర్చించుకున్నారు.

లింగాపురంలో భీమరాయుడి గుడి వద్ద పామును మింగుతున్న కప్ప



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

- నిధుల కేటాయింపుపై ఆర్టీసీ ఉద్యోగుల హర్షం


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

పాలమూరు, ఫిబ్రవరి 10 : సంస్థ నిర్వహణ కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిధులు విడుదల చేయడంపై ఆర్టీసీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి జిల్లా కేంద్రంలో క్షీరాభిషేకం చేశారు. ఆర్టీసీ మనుగడ కోసం ప్రభుత్వం రూ.281 కోట్ల నిధులు సంస్థ ఎండీ సజ్జనార్‌కు అందజేయటంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. బాండ్ డబ్బులు ప్రతీ ఉద్యోగికి సుమారు రూ.లక్షవరకు అందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రాంజీ, జైరామ్, వెంకటయ్య, చంద్రమోహన్, తిరుపతయ్య, శ్రీనివాసులు, గ్యారేజ్ ఉద్యోగులు, డ్రైవర్స్, కండక్టర్లు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే, ఎంపీలకు ఆహ్వానం

నవాబ్‌పేట, ఫిబ్రవరి 10 : మండలంలో నిర్వహించే సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలకు రావాలని జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, చింబోడ్ అభిమన్యురెడ్డిలను పలువురు గిరిజన సంఘం నాయకులు కోరారు. మండల గిరిజన సంఘం నాయకులు లింబ్యా, విస్లావత్ చందర్ నాయక్, ఉప సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్, ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో వారిని మర్యాద పూర్వకంగా కలిసి ఉత్సవాలకు రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శంకర్ నాయక్, రాములు నాయక్, రాజు నాయక్, తరుణ్, లింబ్యా నాయక్, నర్సింహ నాయక్, మణ్యా నాయక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహరాజ్ జయంతిని జయప్రదం చేయాలి

బాలానగర్ : బంజారా గిరిజన ఆరాధ్యదైవం సంతు సేవాలాల్ మహరాజ్ జయంతిని వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఎల్‌హెచ్‌పీఎస్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. తిరుమలగిరి గ్రామ పంచాయతీలోని సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పాల్గొనాలని కోరారు.

జిల్లా పౌరసంబంధాల అధికారిగా శ్రీనివాస్


నూతన డీపీఆర్‌వో శ్రీనివాస్‌ను అభినందిస్తున్న సిబ్బంది

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఫిబ్రవరి 10 : జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకులుగా పి. శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత కలెక్టర్ జి. రవి నాయక్‌ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన నల్లగొండ జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ సహాయ సంచాలకులుగా ఐదున్నరేళ్లకుపైగా విధులు నిర్వహించారు. ఆయనను మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ చేస్తూ సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో బాధ్యతలు తీసుకున్న పి. శ్రీనివాస్‌ను కార్యాలయ సిబ్బంది పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ జిల్లా సమాచార, పౌరసంబంధాల సహాయ సంచాలకులుగా పనిచేసిన యు. వెంకటేశ్వర్లు నల్గొండ జిల్లాకు బదిలీ అయ్యారు.

క్రీడలతో శారీరక ధృడత్వం

- క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభంలో మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్

భూత్పూర్, ఫిబ్రవరి 10 : క్రీడలు ఆడడం వల్ల మానసిక, శారీరక ధృడత్వాన్ని ఇస్తాయని మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్ అన్నారు. శనివారం మునిసిపల్ పరిధిలోని 3వ వార్డులో ఉన్న అంబ్రుతండాలో సేవాలాల్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్, వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ క్రికెట్ పోటీల్లో విజయం సాధించిన వారికి ప్రత్యేక బహుమతులు ఇవ్వనున్నట్లుగా తండావాసులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణ గౌడ్, నాయకులు సత్యనారాయణ, యువకులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయి

- కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి

బాలానగర్, ఫిబ్రవరి 10 : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలు శరీర ధారుడ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లా క్రీడాకారులు పాల్గొన్నారు.

వారాంతపు పరీక్షల జవాబు పత్రాల పరిశీలన

జడ్చర్ల, ఫిబ్రవరి 10 : మండలంలోని ఆలూరు గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వారాంతపు పరీక్షల జవాబు పత్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ పరిశీలించారు. ఆలూరు జడ్పీహెచ్‌ఎస్, జడ్చర్ల పట్టణంలోని హరిజన వాడ జడ్పీహెచ్ పాఠశాలలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వార్షిక పరీక్షలకు పదవ తరగతి విద్యార్థులు ఎలా సిద్ధమవుతున్నారంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణం సాధించాలని ఈ సందర్భంగా సూచించారు. హెచ్‌ఎంలు యుగంధర్, సత్యశీలరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఐ ఆనంద్‌కు గిరిజన నాయకుల సన్మానం

మిడ్జిల్, ఫిబ్రవరి 10 : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ ఆనంద్‌ను శనివారం గిరిజన సంఘం నాయకులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు శ్రీనునాయక్, శంకర్‌నాయక్, సీతారాం, నానునాయక్, భాస్కర్‌నాయక్, మధు, రమేష్‌నాయక్, శ్రీను, సక్రునాయక్ ఉన్నారు.

రాజకీయ పార్టీలు స్థానికులకే అవకాశం ఇవ్వాలి

- మహబూబ్‌నగర్ డెవలప్‌మెంట్ ఫోరం చైర్మన్ మున్నూరు రవి

జడ్చర్ల, ఫిబ్రవరి 10 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానానికి స్థానిక అభ్యర్థులకే అన్ని రాజకీయ పార్టీలు అవకాశం ఇవ్వాలని మహబూబ్‌నగర్ డెవలప్‌మెంట్ ఫోరం చైర్మన్ మున్నూరు రవి డిమాండ్ చేశారు. జడ్చర్లలోని టీఎన్జీఓ భవనంలో శనివారం 'మన ఊరు - మన అభివృద్ధి' పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో స్థానికేతరులకు గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో లేకుండాపోయారని ఆరోపించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నడిమింటి శ్రీనివాసులు, సాజిదాసికందర్, జహంగీర్‌పాషా, అనిల్‌కుమార్, సారంగి వినయ్‌కుమార్, నర్సింగ్‌రావు, మసియొద్దీన్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలించొద్దని కందకం తవ్విన గ్రామస్థులు

జడ్చర్ల, ఫిబ్రవరి 10 : జడ్చర్ల, మిడ్జిల్ మండలాల పరిధిలోని దుందుభీనదిలో నుంచి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అమ్మపల్లి, అమ్మపల్లి కాలనీ, భైరంపల్లి గ్రామస్థులు శనివారం కందకాలు తవ్వారు. దుందుభీనదిలో నుంచి ఇసుకను అక్రమంగా రవాణ చేయకుండా దుందుభీ నదితో పాటు పంట పొలాల్లో నుంచి ఇసుక వాహనాలు పోకుండా కందకాలను ఎక్స్‌కవేటర్‌లతో తవ్వారు. ఇసుక అక్రమ రవాణాను ఆపేందుకు వచ్చిన గ్రామస్థులపై ఇసుక మాఫియా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, అక్రమ రవాణా ఆపేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హన్వాడ/ రాజాపూర్, ఫిబ్రవరి 10 : హన్వాడ, రాజాపూర్ మండలాల్లో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను వేర్వేరుగా పోలీసులు పట్టుకున్నారు. శనివారం తెల్లవారుజామున చిన్నదర్పల్లి వద్ద వెంకటాపూర్‌కు చెందిన గోపాల్, రాజులకు సంబంధించిన ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తుండగా పక్కా సమాచారంతో పట్టుకున్నట్లు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు హన్వాడ ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. రాజాపూర్ మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో ఉన్నదుందుంభీ వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ కే.రవి తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ సుభాష్ రాథోడ్ పట్టుకున్నారని తెలిపారు. ట్రాక్టర్ యాజమని చుక్క జగన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నులిపురుగుల మందులు వేయించాలి

భూత్పూర్, ఫిబ్రవరి 10 : పాఠశాలకు వచ్చే ప్రతీ విద్యార్థికి తప్పని సరిగా నులిపురుగు మందులను వేయించాలని సీహెచ్‌వో ఆయూఫ్‌ఖాన్ ఉపాధ్యా యులను కోరారు. శనివారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 20న మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఐదు నుంచి 19 సంవత్సరాల వయస్సు వరకు ఉన్న పిల్లలకు ఉచితంగా నులి పురుగుల నివారణ మందులను వేస్తారని తెలిపారు.


కురుమూర్తిస్వామి సన్నిధిలో వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే

ఇది పాంహౌజ్ ప్రభుత్వం కాదు

- కార్నర్ మీటింగ్‌లో చల్లా వంశీచంద్‌రెడ్డి

చిన్నచింతకుంట, ఫిబ్రవరి 10 : రాష్ట్రంలో గత బీఆర్‌ఎస్ హయాంలోని పాంహౌజ్ ప్రభుత్వం మాదిరిగా కాకుండా ఇప్పుడు ప్రజా ప్రభుత్వం కొనసాగుతోందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి తెలిపారు. పాలమూరు న్యాయ యాత్రలో భాగంగా శనివారం రాత్రి చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వరస్వామిని దేవరకద్ర ఎమ్మెల్యే జీ. మధుసూదన్ రెడ్డితో కలిసి ఆయన దర్శించుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో భారీ రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు తగ్గట్లుగా సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పేదలకు అన్యాయం చేసిందని తెలిపారు. ఇక్కడ ప్రజలకు ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు, పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే తప్పకుండా జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌళిక వసతుల ఏర్పాటుకు కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం నాయకులు నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ఖైమూద్, వెంకటేష్, శ్రావన్, జీజీ పౌలు, కుర్వగోపాల్, అశోక్, రఫీ పాల్గొన్నారు.

పోలీసులపై దాడిచేసిన ఐదుగురిపై కేసు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 10 : మద్యం మత్తులో పోలీసులపైనే దాడికి పాల్పడిన కేసులో ఐదుగురిపై కేసు నమోదు చేసిన సంఘటన ఇది. ఈనెల1న అర్ధరాత్రి తరువాత 1:15 గంటలకు పట్టణంలోని పారెస్ట్ కార్యాలయం ఎదురుగా మొబైల్ హోటల్ దగ్గర ఐదుగురు యువకులు మద్యం సేవిస్తుండగా బీట్ నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు రాఘవేంద్ర రావు, గంజి యాదయ్యలు వారి వద్దకెళ్లి బహిరంగ ప్రదేశంలో మద్యం తాగడం సరికాదని ప్రశ్నించగా వారితో గొడవకు దిగారు. పోలీసులపై చేయిచేసుకుని, పరుషపదజాలంతో దూషించారు. దీంతో ఎస్ఐ జిక్కిబాబుకు సమాచారం ఇవ్వడంతో ఆయన వెంటనే అక్కడికి చేరుకోగా, ఆయనపైనా చేయిచేసుకున్నారు. మా విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా చేయిచేసుకోవడం, దూషించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కానిస్టేబుల్ రాఘవేంద్రరావు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా నిందుతులైన వంశీ, విజయ్, ప్రవీణ్, చందు, భానులపై కేసు నమోదుచేసి సీఐ స్వామి దర్యాప్తు చేస్తున్నారు. కాగా వీరి వద్ద ఓ గంజాయి ప్యాకెట్ కూడా లభించినట్లు సమాచారం.

పీజీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 10 : పీజీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాని పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉమ్మడి జిల్లాలోని పాలమూరు యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న ఎనిమిది పీజీ కళాశాలల విద్యార్థులకు పీజీ 3వ సెమిస్టార్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు 1556 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1482 మంది విద్యార్థులు హాజరు కాగా 73మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మాల్ ప్రాక్టీస్‌లో ఒకరు బుక్ అయ్యారని పీయూ పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. పీజీ పరీక్ష కేంద్రాల పరిశీలనలో పీయూ వీసీతోపాటు పీయూ అధికారులు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ చంద్రకిరణ్, డాక్టర్ కృష్ణయ్య, డాక్టర్ రాజ్ కుమార్, అదికారులు పాల్గొన్నారు.


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్


పోలేపల్లి ఎస్వీకెఎం పాఠశాలలో క్రీడాజ్యోతిని వెలిగించిన డీఈవో రవీందర్


పోలేపల్లి ఎస్వీకెఎం పాఠశాలలో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

పిల్లలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం అవసరం

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి

భూత్పూర్, ఫిబ్రవరి 10 : పిల్లలు విద్యలో రాణించాలంటే తల్లిదండ్రుల ప్రోత్సాహం చాలా అవసరమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలోని న్యూ ఎరా పాఠశాల 23వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథులుగా జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డితో పాటు మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్ తదితరులు హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో గ్రామీణ ప్రాంతాల పిల్లలు కూడా ఉన్నత విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. పేదరిక నిర్మూలన విద్యతోనే సాధ్యమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా తకువ ఫీజుతో ఇంగ్లిష్ మీడియం విద్యను అందిస్తున్న న్యూ ఎరా పాఠశాల విద్యాసంస్థల యాజమాన్యాన్ని స్వర్ణాసుధాకర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, ఎంఈవో నాగయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మేకల సత్యనారాయణ, పాఠశాల కరస్పాండెంట్ క్రాంతికుమార్, హెచ్ఎం భరద్వాజ్, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలి : డీఈవో

జడ్చర్ల, ఫిబ్రవరి 10 : విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు క్రీడలు ఎంతో దోహదపడుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ అన్నారు. జడ్చర్ల మండలం పోలేపల్లి టీఎస్ఐఐసీలోని ఎస్వీకెఎం పాఠశాలలో శనివారం జరిగిన క్రీడోత్సవ్-2024 కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరకంగా ధృడంగా తయారవుతారని, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. క్రీడోత్సవ్‌లో ఎస్వీకెఎం పాఠశాలతో పాటు మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని 8 పాఠశాలల విద్యార్థులతో పాటు అండర్-14 బాల, బాలికల విభాగంలో హైదరాబాద్ నుంచి మూడు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. క్రీడోత్సవ్‌లో కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎబెనెజర్‌తో పాటు ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి వాసికి డాక్టరేట్

- అభినందించిన వీసీ, అధికారులు, అధ్యాపకులు

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 10 : రైతు కుటుంబం నుంచి వచ్చిన కరుణాకర్ రెడ్డి డాక్టరేట్ దక్కింది. శనివారం పీయూలో వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్, పీయూ అధికారులు అధికారికంగా పత్రిక ప్రకటన జారీ చేస్తూ పీహెచ్‌డీకి సంబంధించిన పత్రాలను ఎంఈడీ అధ్యాకులు డాక్టర్ కరుణాకర్ రెడ్డికి అందజేశారు. నాగర్ కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి గ్నామంలో రైతు ప్రతాప్‌రెడ్డి, కృష్ణమ్మల కుమారుడు కరుణాకర్‌రెడ్డి రేమొద్దుల గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో పదవ తరగతి వరకు, ఇంటర్ పెద్దకొత్తపల్లిలో, డిగ్రీ మహబూబ్‌నగర్‌లో, ఓయూలో బీఈడీ, ఎంఎ సైకాలజీ అంబేడ్కర్ యూనివర్సిటీ, ఎంఈడీ శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీలో పూర్తిచేశారు. నెట్ ద్వారా ఓయూ ప్రొఫెసర్ మధుమతి పర్యవేక్షణలో పీహెచ్‌డీ అడ్మిషన్ పొంది 'కంప్యూటర్ సెల్ఫ్ ఎఫికసి, కంప్యూటర్ యంక్సైటీ అండ్ యాటిట్యూడ్ టు వర్డ్స్ ఈ లెర్నింగ్ అమంగ్ బీఎడ్ స్టూడెంట్స్' అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేశారు. నీల్ కమల్ పబ్లికేషన్స్‌లో రెండు పుస్తకాలు రాశారు. తెలుగు అకాడమీలో పోటీ పరీక్షలకు పుస్తాకలను రాశారు. జాతీయా అంతర్జాతీయా స్థాయిలో అనేక సెమినార్లలో పాల్గొన్న కరుణాకర్ రెడ్డికి ఓయూ పరీక్షల నిర్వహణ అధికారులు డాక్టరేట్‌గా ప్రకటించారు. ప్రస్తుతం పీయూలో ఎంఈడీ విభాగంలో అధ్యాపకునిగా పనిచేస్తూ డాక్టరేట్ పొందిన కరుణాకర్‌రెడ్డిని పీయూ అధ్యాపకులు బీఈడీ ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్, ఎంఈడీ అధ్యాపకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.


కరుణాకర్ రెడ్డికి పీహెచ్‌డీ పత్రాలను అందిస్తున్న పీయూ వీసీ తదితరులు

చలో నల్గొండ పోస్టర్ ఆవిష్కరణ

జడ్చర్ల, ఫిబ్రవరి 10 : ఈ నెల 13న నల్గొండలో నిర్వహించే బహిరంగ సభ పోస్టర్‌ను శనివారం జడ్చర్లలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు తెలంగాణ ప్రాజెక్టులను ప్రస్తుత ప్రభుత్వం తాకట్టు పెడుతోందని, దీంతో మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి, మెదక్, ఖమ్మం జిల్లాల రైతులకు నష్టం వాటిల్లనుందని అన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధికసంఖ్యలో తరలిరావాలని జడ్పీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు రఘుపతి రెడ్డి, రఘురాంగౌడ్, పిట్టల మురళీ, కొంగళి జంగయ్య, పాలాది రాంమోహన్, ఇంతియాజ్‌ఖాన్, నర్సిములు, శంకర్‌నాయక్, గిరియాదవ్, కరాటే శ్రీను, నర్సిములు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకులలో వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

అడ్డాకుల : కృష్ణానది జల్లాలో తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం కేఆర్ఎంబీకి అప్పగించడానికి వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన చలో నల్లగొండ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు శనివారం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. చలో నల్లగొండను విజయవంతం చేయాలని శ్రీనివాస్‌రెడ్డి కోరారు. నాయకులు తిరుపతిరెడ్డి, ఖాజాహోరి, ఎంపీటీసీ రంగన్నగౌడ్, దేవేందర్‌రెడ్డి, బొడ్డు రమేష్, చంద్రకాంత్, దేవదానం పాల్గొన్నారు.


జడ్చర్లలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

భక్తి శ్రద్ధలతో విగ్రహాల పునఃప్రతిష్ఠ

మిడ్జిల్, ఫిబ్రవరి 10 : మండలంలోని మల్లాపూర్ గ్రామంలోని శ్రీలక్ష్మీచెన్న కేశవస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయంలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. గంటమఠం గౌరారం నాగభూషన్ అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాలను గ్రామాలను ప్రత్యేక వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. అనంతరం జలాధివాసం, ధాన్యధివాసంతో పాటు పలు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు, బంధువులు తరలిరావడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఆదివారం విగ్రహాల ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం ఏర్పాటు, రాత్రికి అగ్ని గుండాలు కార్యక్రమాలు ఉంటాయని జంగారెడ్డి తెలిపారు. ఆలయ చైర్మన్ కొప్పుల వెంకటయ్య, వైస్ చైర్మన్‌లు సుధాకర్‌రెడ్డి, దశరథచారి, కోశాధికారి చెన్నయ్య, ప్రధానకార్యదర్శి బంగారు, సభ్యులు తిరుపతయ్య, బంగారి, వెంకటయ్య, వెంకటస్వామి, గోవర్ధన్‌రెడ్డి, విష్ణువాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మన్యం, అంజిరెడ్డి ఉన్నారు.

● మండలంలోని మసిగుండ్లపల్లి గ్రామంలో శనివారం భక్తి శ్రద్ధలతో కోట మైసమ్మ గ్రామ దేవత విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమాలను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి మాతృమూర్తి, రంగారెడ్డిగూడ గ్రామ మాజీ సర్పంచు జనంపల్లి శశికళ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, ఎంపీటీసీ తదితరులతో కలిసి పూజలు చేశారు. అంతకు ముందు బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ సుమతమ్మ, మాజీ ఉప సర్పంచ్ మతీన్, గ్రామ పెద్దలు అమర్‌నాథ్‌రెడ్డి, అశ్వక్, చెన్నయ్య దేవాలయ కమిటీ చైర్మన్ వెంకటయ్య, వైస్ చైర్మన్ శ్రీశైలం, కావలి చెన్నయ్య, అశ్వక్, తిరుపతి, లాలు, గౌస్, రమేష్, శ్రీశైలం, ఉమేష్, కృష్ణారెడ్డి, ఈశ్వరయ్య, భీంరాజు ఉన్నారు.


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తల్లి శశికళ

లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

జడ్చర్ల : మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల మొదటి రోజు సందర్భంగా స్వామివారికి, అమ్మవారికి అష్టోత్తర శత(108) కలశాభిషేకంను పండితులు ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ అనంత్‌రెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను ఈ నెల 18 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ దీప్తిరెడ్డి తెలిపారు. జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివస్వాముల పడిపూజ

దేవరకద్ర : మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ దగ్గర శ్రీశైల మల్లన్న మహాపూడిపూజ కార్యక్రమం ఘనంగా జరుపుకున్నారు. పూజారి నాగరాజు, భూషన్ ఆధ్వర్యంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంగం సంతోష్ గురుస్వామి, శివస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

అర్హులైన నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి

జడ్చర్ల, ఫిబ్రవరి 10 : అర్హులైన నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ఇవ్వాలంటూ జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి మహిళా సంఘం ఐద్వా మండల అధ్యక్షురాలు లక్ష్మీ, నాగలక్ష్మీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జగన్ వినతిపత్రం అందజేశారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని ఎర్రగుట్ట వద్ద నిర్మించిన 560 డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు దాదాపు 2వేల మంది మహిళలు దరఖాస్తులు చేసుకున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. సంవత్సరాలుగా అద్దె ఇంట్లో ఉంటూ కిరాయిలు కట్టలేక ఇబ్బందులకు గురవుతున్నారని, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొండిచేయి చూపిందని ఆరోపించారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అసలైన నిరుపేదలను గుర్తించి డబుల్‌బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని కోరారు. వినతిపత్రం అందచేసిన వారిలో ఐద్వా మహిళ సంఘంసభ్యులు లక్ష్మీ, యాదలక్ష్మమ్మ, శారద, లలిత, భాగ్యలత, పద్మ, ఊషమ్మ, అరుణ తదితరులున్నారు.

● రేషన్‌కార్డు లేని వారతో డబుల్‌బెడ్‌రూం దరఖాస్తు తీసుకోవడం లేదు : డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్న వారిలో రేషన్‌కార్డులు లేని వారు సైతం ఉన్నారని, రేషన్‌కార్డు లేని వారి దరఖాస్తులు తీసుకోవడం లేదంటూ జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి దృష్టికి ఎంఐఎం జడ్చర్ల నియోజకవర్గ అధ్యక్షుడు జకీర్‌అలీ తీసుకెళ్లారు. తహసీల్ కార్యాలయంలో దరఖాస్తులు తీసుకుంటున్న కౌంటర్‌లో రేషన్‌కార్డు లేని వారి దరఖాస్తులు తీసుకోవడం లేదని, రేషన్‌కార్డు లేని వారు ఏవిధంగా దరఖాస్తు చేసుకోవాలో తెలియచేయాలని కోరారు.

అవి ప్లాస్టిక్ బియ్యం కావు

-ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ నాగరాజు

నవాబ్‌పేట, ఫిబ్రవరి 10 : రేషన్ షాపుల ద్వారా ప్రజలకు అందిస్తున్న బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం వస్తున్నాయన్న ఆరోపణల్లో నిజం లేదని, వాటిని ప్రజలు నమ్మరాదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ నాగరాజు అన్నారు. శనివారం మండలంలోని లోకిరేవు గ్రామ రేషన్ షాపులో బియ్యం ప్రజలకు అందిస్తుండగా అందులో ఉన్న బియ్యం ప్లాస్టిక్ బియ్యం అని ప్రజలు ఆందోళన చెందడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ నాగరాజు గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పౌష్టికాహారం కల్గిన బియ్యం పిండితో చేసిన పదార్థాలను అందులో కలిపినట్లు తెలిపారు. ఎవరూ ఆందోళన చెందరాదన్నారు.

కరెంటు మీటర్లకు ఆధార్ లింక్ చేసుకోవాలి

గండీడ్, ఫిబ్రవరి 10 : కరెంటు మీటర్లకు ఆధార్ లింక్ చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్ తెలిపారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ వినియోగ దారులు తమ ఆధార్, రేషన్ కార్డు, గ్రామ పరిపాలన అధికారి ఇచ్చే రసీద్‌తో పాటు ఫోన్ నంబర్‌ను తీసుకొని గ్రామంలో ఉన్న సంబంధిత విద్యుత్ సిబ్బందికి అందించి విద్యుత్ బిల్లులకు అనుసంధానం చేసుకుంటేనే 200 యూనిట్ల ఉచిత కరెంటు వర్తిస్తుం దని, ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏఈ తెలిపారు.

'భూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి'

జడ్చర్ల, ఫిబ్రవరి 10 : పాలమూరు ఎత్తిపోతల పథకంలో భూముల సేకరణలో జీఓ 123 ద్వారా భూములు కోల్పోయిన రైతులకు 2013 భూసేకరణ చట్టం అమలు చేసి, పరిహారం ఇప్పించాలంటూ రైతురాజ్యం పార్టీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంటీ బాలకృష్ణ కోరారు. శనివారం ముఖ్యమంత్రి సలహాదారు షబ్బీర్‌అలీకి వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీలోని ఆయన చాంబర్‌లో కలిసినట్లు తెలిపారు. భూములు కోల్పోయి, జీఓ నెంబరు 123 ద్వారా అతితక్కువ పరిహారం అందడంతో ప్రాజెక్టులో పాదయాత్రలు చేపట్టిన సందర్భంలో జీఓ నెంబరు 123ను తొలగించి, 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలంటూ నాడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రాజెక్టులో భూములు కోల్పోయిన వారికి బడ్జెట్ కేటాయిస్తారని ఆశతో ఎదురు చూసామని, అందుకు భిన్నంగా బడ్జెట్ ఉందని పేర్కొన్నారు. నాడు విడుదల చేసిన కరపత్రాలు తమ వద్ద ఉన్నాయని, 2013 చట్టాన్ని అమలు చేయాలని కోరారు.

ఈదుకుంట కట్ట ధ్వంసం

నవాబ్‌పేట, ఫిబ్రవరి 10 : మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఈదుకుంట కట్టను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు కింద సుమారు 30 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రతీఏటా ఈ కుంట నీటితో పంటలు సమృద్ధిగా పండుతాయి. ఇటీవల గ్రామస్థులు కొందరు ఓ ప్రైవేటు వ్యక్తుల వద్ద డబ్బులు పోగు చేసి ఈదుకుంట కట్టను చదును చేసి అక్కడ మద్యం, వ్యాపార కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి కట్ట తొలగించిన వారిపై చర్యలు తీసుకొని కట్టను యథావిధిగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ మల్లికార్జున్ రావును వివరణ కోరగా కుంట కట్ట చదును చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులకు పరీక్షల సామగ్రి పంపిణీ

రాజాపూర్, ఫిబ్రవరి 10 : మండలంలోని రంగారెడ్డిగూడ గ్రామంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం పరీక్షలు రాయడానికి ప్యాడ్లు, పెన్నులు, పలు రకాల వస్తువులను అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్ నాయక్ తన పుట్టిన రోజు సందర్భంగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రీనివాస్ నాయక్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, రమేష్, రాము, బాలు, ఉపాధ్యాయులు నాగయ్య, లక్ష్మి, శంకర్‌రావు, పుష్పలత పాల్గొన్నారు.